ఘనంగా మహిళా దినోత్సవం

విశాలాంధ్ర-తాడేపల్లి : అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో బుధవారం నారా లోకేష్ సంజీవని హాస్పిటల్‌లోని మహిళ సిబ్బందిని సత్కరించి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లా డుతూ నేటి సమాజంలో స్త్రీల పాత్ర అభినందనీయమన్నారు. మహిళలందరూ తమ ఉనికిని చాటుకొని స్వశక్తితో ఆత్మగౌరవంతో ఉన్నత స్థితికి చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు, గుంటూరు పార్లమెంట్ ఎస్సీ సెల్ కార్యదర్శి బెజ్జం రామకృష్ణరావు, సీనియర్ నాయకులు మండవ గోపాల రావు, ఇట్టా పెంచలయ్య, మంగళగిరి నియోజకవర్గ టీఎన్‌టీ యూసీ అధ్యక్షులు కేటీవీ ప్రసాద్, పట్టణ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు కంభం సాయి చంద్, కంచర్ల శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మంగళగిరి : అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని జనసేన రాష్ట్ర కార్యాలయంలో జనసేన పార్టీ వీర మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలలో భాగంగా భక్తిగీతాలు, అమ్మ విలువలతో కూడిన గానాలతో పలు నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. కోలాహలంగా మారిన జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయం చిన్నారుల నృత్య ప్రదర్శనలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

తాడికొండ : పొన్నెకల్లు సీపీఐ కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. నేటి సమాజంలో పురుషులతోపాటు మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని పలువురు వక్తలు కొనియాడారు. సమాజంలో మహిళలకు ఎనలేని గౌరవం ఉందన్నారు. ఈ సందర్భంగా తాడికొండ నియోజకవర్గ మహిళా సమైక్య అధ్యక్షురాలుగా షేక్ శిలార్ బి, మండల కార్యదర్శిగా కోటా రత్నకుమారి, గ్రామ కార్యదర్శిగా ముప్పాల సత్యవతిని ఎన్నుకోవడం జరిగింది. మహిళలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివశంకర్ రావు, ఏఐటీయూసీ రాజధాని ప్రాంత కార్యదర్శి జీవీ రాజు, గ్రామ కార్యదర్శి రామినేని రామారావు, స్వర్ణకుమారి, పీవీ సుభాష్, మల్లికార్జున అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

తాడేపల్లి : కేఎల్ విశ్వవిద్యాలయంలో ఎన్‌సీసీ 10వ బెటాలియన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు బాలికలకు వ్యాస రచన, డ్యాన్స్, వంటి పలు రకాల పోటీలను నిర్వహించారు. కేఎల్ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న పలువురు మహిళా అధ్యాపకులు, మహిళా విభాగాధిపతులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు గౌరవ అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో మహిళ పాత్ర ఎంతో కీలకమన్నారు. డిప్యూటీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.శాంతకుమారి మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక స్వతంత్ర అవసరమన్నారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రో వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, విద్యార్థి వ్యవహారాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూత్ రమ్య, డాక్టర్ హబీబుల్లాఖాన్ పాల్గొన్నారు.



గుంటూరు : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం, గోరంట్ల ఏఆర్‌టీ సెంటర్‌లో మహిళా దినోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెన్నెలను దుశ్శాలువా, పూలమాలలతో సన్మానించారు. మహిళ ఉద్యోగులందరికీ గులాబీ పూలతో శుభాకాంక్షలు తెలియజేశారు. కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



గుంటూరు : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విశాఖ ఓబీసీ జోనల్ కార్యాలయంలో మహిళా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సెంట్రల్ లేబర్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ వల్లూరు జయప్రకాష్ నారాయణ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన చేతుల మీదుగా కొంతమంది మహిళలకి చీరలు పంపిణీ చేసి ఘనంగా సన్మానించారు. రాజకీయ, సామాజిక అన్ని వ్యవస్థలోని మహిళలు చురుకుగా పనిచేస్తారని కొనియాడారు. పల్లి శ్రీనివాసులు నాయుడు, పాలపాటి రవికుమార్, వెలగలేటి గంగాధర్, యడ్ల రమణరాజు, దాసరి శివశంకర్రావు, గుడుగుండ్ల శంకర్ ప్రసాద్, చొక్కాకుల రాంబాబు, కొప్పుల రామ్ కుమార్, రాగతి రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి : పట్టణ, పరిసర ప్రాంతాలలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాలు విస్తృతంగా జరిగాయి. ఎమ్మెల్యే మహిళా పాల్గొని మహిళా హక్కులను గురించి వివరించారు. స్త్రీ పురుషులలో ఒకరు ఎక్కువ తక్కువ అనే భావనపై స్త్రీ, పురుషుల మూస పాత్రపై ఆధారపడిన ఆచార వ్యవహారాలను తొలగించాలంటే సాంఘిక సాంస్కృతిక చట్టాలను మార్చాలన్నారు. ఈ ప్రభుత్వం స్త్రీల రక్షణ కోసం కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమాలలో తెనాలి చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

ఈ దిగువ తెలిపిన ఆస్తి నాకు అనగా **పంచుమర్తి శ్రీదేవి భర్త పంచుమర్తి భూపతి రావు**, నివాసము :- డోర్ నెం. 20-5-679, ఫ్లాట్ నెం : 402, వెంకటనాగసాయి రెసిడెన్సీ, ముత్యాలరెడ్డి నగర్, 4వలైను, గుంటూరు, చంద్రమౌళీనగర్, గుంటూరు - 522007కు మా అమ్మమ్మ గారైన **పైనేని అనసూయమ్మ భర్త బసవరావు** నివాసము :- ఫ్లాట్ నెం. 403, కె.వి.ఆర్. అపార్ట్‌మెంట్స్, 3వలైను, అంజనేయపేట, అమరావతి రోడ్డు, గుంటూరు సిటీ, గుంటూరు జిల్లా, వారి వద్ద నుండి తేది : 22-03-2018న నాకు వీలునామా ద్వారా సంక్రమించియున్నది. సదరు ఆస్తిపై నేను శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, అడ్రస్ : 2వ ఫ్లోర్, డోరు నెం : 5-87-37-4, శ్రీ లక్ష్మీకాంప్లెక్స్, మెయిన్‌రోడ్, 4/1 బ్రాడీపేట, గుంటూరు-522002 నందు మా ర్టిగేజ్ లోన్ తీసుకొనుటకు సిద్దపడియున్నాను. కావున ఈ ఆస్తి పైన ఆక్షేపణలు/క్లైమ్స్ ఎవరికైనా ఉన్న యెడల ఈ నోటీసు తేది నుండి 5 రోజుల లోపల మీ ఆక్షేపణలు ఉన్నచో నాకు గాని లేదా పై తెలిపిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి తెలియజేయగలరు. **ఈ ఆస్తి వివరములు : 1వ అయిటం :** గుంటూరు డి. ప్రత్తిపాడు సబ్.డి. యిలాకా ఉన్నవ గ్రామ పంచాయితీ యేరియాలోని మల్లిపాలెం గ్రామ డి.నెం. 5/7 లెటరు దాఖలా య.0-55 సెంట్ల పూరా విస్తీర్ణము లో దివ్య ఎస్టేట్స్, గుంటూరు వారిచే తయారుచేయబడిన లే-అవుట్ డి.టి.సి.పి. అప్రూవల్ నెం.యల్.పి.నెం. 106/2008/జి. రు దాఖలా నీకు విక్రయించిన ప్లాటు నెం. 31-బి, రు దాఖలా చ.గ. 300లకు హద్దులు. **తూర్పు :** ప్లాట్ నెం. 34రు స్థలము హద్దు. అ.51-0 అం, **దక్షిణం :** ముద్దన హరికృష్ణ గారి ప్లాట్ నెం. 32-ఎ, రు స్థలము హద్దు అ.53-0లు, **పడమర :** అ.33-0లు వెడల్పు గల రోడ్డు హద్దు అ.51-0 అం, **ఉత్తరం :** ధూళిపాళ్ళ హరివెంకట సుబ్బయ్య శాస్త్రి గారి ప్లాట్ నెం. 31-ఎరు స్థలము హద్దు. అ.53-0లు, యీ హద్దుల మధ్య మూడు వందల చదరపు గజములు లేక యిందుకు సరియగు చ.మీ. 250-83గ నివేశన స్థలము మాత్రం. **2వ అయిటం :** గుంటూరు డి. ప్రత్తిపాడు సబ్.డి. యిలాకా ఉన్నవ గ్రామ పంచాయితీ యేరియాలోని మల్లిపాలెం గ్రామ డి.నెం. 5/7వ లెటరు దాఖలా య.0-55 సెంట్ల పూరా విస్తీర్ణములో దివ్య ఎస్టేట్స్, గుంటూరు వారిచే తయారుచేయబడిన లే-అవుట్ డి.టి.సి.పి. అప్రూవల్ నెం. యల్.పి.నెం, 106/2008/జి. రు దాఖలా నీకు విక్రయించిన ప్లాటు నెం. 33-ఎ రు దాఖలా చ.గ.250లకు హద్దులు : **తూర్పు :** అ.33-0 లు వెడల్పు గల రోడ్డు హద్దు. అ.42-61అం, **దక్షిణం :** దమ్ము శ్రీహరి గారి ప్లాట్ నెం. 33బి. రు స్థలము హద్దు అ.53-0లు, **పడమర :** ప్లాట్ నెం. 32రు స్థలము హద్దు. అ. 42-6అం, **ఉత్తరం :** ప్లాట్ నెం. 34రు స్థలము హద్దు అ.53-0లు. యీ హద్దుల మధ్య రెండు వందల యాభై చదరపు గజములు లేక యిందుకు సరియగు చ.మీ. 209గ నివేశన స్థలము మాత్రం. వెరశి రెండు అయిటములు చ.గ. 550ల నివేశన స్థలము మాత్రము. పై తెలిపిన 1వ అయిటం మరియు 2వ అయిటం రెండు ఆస్తులు కూడా మా అమ్మమ్మ గారికి **ద.నెం. 2347/2014** రు మరియు ద.నెం. 1259/2014రు ద్వారా ఈ ఆస్తి వచ్చియున్నది.

సంప్రదించవలసిన అడ్రస్ : **పంచుమర్తి శ్రీదేవి** సెల్ : 9701363612

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర ఎనలేనిది: ఎస్టీయూ

విశాలాంధ్ర-గుంటూరు : దేశాభివృద్ధిలో మహిళల పాత్ర ఎనలేనిదని, రాజకీయ, ఆర్థిక, సామాజిక, క్రీడా, సాంస్కృతిక, కళలు, అంతరిక్ష రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు విశేష కృషిచేసి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో ఎనలేని పాత్ర పోషిస్తున్నారని ఎస్టీయూ గుంటూరు జిల్లా అధ్యక్షులు గేరా మోహనరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎస్టీయూ గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో గుంటూరు ఎస్టీయూ భవన్‌లో మహిళా దినోత్సవ వేడుకలను రాష్ట్ర మహిళా కన్వీనర్ సిహెచ్ ఉమాదేవి, జిల్లా మహిళా కన్వీనర్ పి.రమాదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎస్.రామచంద్రయ్య మాట్లాడుతూ మహిళా సాధికారత ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమని, మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తే అద్భుతాలు సాధిస్తారని తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈ.అంబరీషుడు మాట్లాడుతూ శాంతి, సహనం, త్యాగానికి, స్త్రీలు ప్రతిరూపాలని కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలోని వివిధ మండలాలకు చెందిన 40 మంది మహిళ ఉపాధ్యాయులను పూలదండలు, శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా నరసింహారావు, రాష్ట్ర కౌన్సిలర్ కె.బెసర్ బాబు, గుంటూరు ఏరియా కార్యదర్శి కొరివి అనిల్ కుమార్, పేరేచర్ల శ్రీనివాసరావు, కేవీ రమణ, సాలార్ బేగ్, బాబురావు, ఎండీ నజీర్, వి.కృష్ణారెడ్డి, మార్పు వెంకటేశ్వర్లు, ఎస్తేరు రాణి, ప్రమీల, జ్యోతి, దిన, రూపా దేవి, రమాదేవి, ఉమాదేవి, పర్వీనియా, శారద, విజయనిర్మల, మాధవి, తాహేరా తదితరులు పాల్గొన్నారు.

శారీరక దృఢత్వంతో మహిళలు దేన్నైనా సాధించగలరు..

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : శారీరక దృఢత్వంతోనే మహిళలు దేనినైనా సాధించగలరని గుంటూరు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ షేక్ సజీల తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఓయాసిస్ ఫెర్టిలిటీ హాస్పిటల్ యాజమాన్యం స్థానిక లక్ష్మీపురం మదర్‌థెరీస్సా విగ్రహం వద్ద డిప్యూటీ మేయర్ షేక్ సజీల, ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ వి.రమ్యలు 5కె వాక్‌థాన్ బెలూన్లు వదిలి ప్రారంభించారు. ఈ సందర్భంగా సజీల మాట్లాడుతూ రోజువారి జీవితంలో మహిళలకు ఫిట్‌నెస్ ప్రాధాన్యత గురించి తెలియజేయడానికి 5కె వాక్‌థాన్ నిర్వహించడం గొప్ప విషయమన్నారు. మహిళలు తమ కుటుంబ పోషణ నిమిత్తం ఎంత బిజీగా ఉన్నా తమ ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం చేయడం మంచిది కాదన్నారు. పురుషులకు ఏమాత్రం తగ్గకుండా మహిళలు నేడు అన్ని రంగాల్లో ముందుకు నడిచి దేశానికి కీర్తి ప్రతిష్టలను తీసుకొస్తున్నారని కొనియాడారు. ఓయాసిస్ ఫెర్టిలిటీ, క్లినికల్ హెడ్ అండ్ ఫెసిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ వి.రమ్య మాట్లాడుతూ శారీరక శ్రమలేమితో నేడు మహిళలు ఎన్నో రకాలైన అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలోనే అసలు ఫిట్‌నెస్ ప్రాముఖ్యత గురించి మహిళలకు తెలియజేయాలన్న ఉద్దేశంతో 5కె వాక్‌థాన్ చేపట్టినట్టు తెలిపారు. అధిక బరువు వలన మహిళలు ఆరోగ్యానికి సంబంధించిన అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఇటువంటి సమస్యలను కేవలం ఎక్సర్‌సైజుల వలన నివారించవచ్చని డాక్టర్ రమ్య వెల్లడించారు. లక్ష్మీపురంలోని మదర్‌థెరీస్సా విగ్రహం నుంచి కొత్తపేటలో ఉన్న ఓయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్ వరకు 5కె వాకథాన్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఓయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్ సిబ్బంది, ప్రభుత్వ మహిళా కళాశాల, టీజేపీఎస్ కళాశాల విద్యార్థినీలు పాల్గొన్నారు.

10న 'దర్పణం' పుస్తకావిష్కరణ, 'పాకుడురాళ్ళు' నాటక ప్రదర్శన

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు కళాపరిషత్ రజతోత్సవ ప్రత్యేక సంచిక 'దర్పణం' పుస్తకావిష్కరణ మహోత్సవం ఈ నెల 10వ తేదిన సాయంత్రం 6.30 గంటలకు గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరుగుతుందని గుంటూరు కళాపరిషత్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వల్లూరు తాండవ కృష్ణ, బి.పూర్ణ తెలిపారు. వెంకటేశ్వర విజ్ఞాన మందిరం ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న) పుస్తకాన్ని ఆవిష్కరిస్తారన్నారు. ముఖ్యఅతిథిగా ప్రఖ్యాత నాటక రచయిత, ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక సంస్కృతి సమితి విశ్రాంత ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్ హాజరౌతారని తెలిపారు. అదేవిధంగా ప్రముఖ సాహితీవేత్త, హిందూ కళాశాల తెలుగుశాఖాధిపతి డాక్టర్ యల్లాప్రగడ మల్లిఖార్జునరావు పుస్తక పరిచయం చేస్తారని వివరించారు. ప్రముఖ నాటక రచయిత, దర్పణం సంపాదకులు, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ గౌరవ అతిథిగా హాజరుకానున్నట్లు వెల్లడించారు. సభానంతరం నస్రీన్ ఇషాక్ దర్శకత్వం వహించిన డాక్టర్ రావూరి భరద్వాజ 'పాకుడురాళ్ళు' నాటకం ప్రదర్శన జరుగుతుందని, 600 పేజీల నవలను 10 యూనిట్లుగా కుదించి గంటా నలభై ఐదు నిమిషాల నాటకంగా మలచినట్లు తెలిపారు. మంజరి అనే ఆశాజీవి సినీపరిశ్రమలోకి అడుగుపెట్టే సన్నివేశాలతో పాటు అడుగుపెట్టాక ఎదురయ్యే పరిస్థితులు వాటి పరిణామాలనూ ఈ నాటకం ద్వారా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో గుంటూరు కళాపరిషత్ ఉపాధ్యక్షులు పీవీ మల్లిఖార్జునరావు, నాయుడు గోపి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జర్నలిస్టుల ప్రమాణస్వీకారోత్సవం

విశాలాంధ్ర-పొన్నూరు : నియోజకవర్గ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్ష, కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం జరిగింది. స్థానిక ఏపీజే అబ్దుల్ కలాం షాదీ ఖానాలో గౌరవాధ్యక్షుడుగా సువర్ణ రాజు, అధ్యక్షుడుగా తోట రాంబాబు, ప్రధాన కార్యదర్శి షరీఫ్, సెక్రటరీ మహమ్మద్ ఖాన్‌లతోపాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ ఎన్.రాధ, రూరల్ సీఐ ప్రభాకర్, పట్టణ ఎస్సై హసీంలు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వానికి ప్రజలకు అనుసంధానంగా జర్నలిస్టుల సేవలు అభినందనీయమని సభలో కొనియాడారు. ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి చట్టాల రూపకల్పనలో ప్రముఖ పాత్ర వహించే జర్నలిస్టుల సేవ హర్షణీయమన్నారు. పట్టణంలోని జర్నలిస్ట్‌లకు నివేశన స్థలాలు, ప్రెస్ క్లబ్ స్థలం, హెల్త్ కార్డులు తదితర మౌలిక సమస్యలను తీర్చేందుకు తన వంతు కృషి చేస్తానని కమిషనర్ హామీ ఇచ్చారు. రూరల్ సీఐ ప్రభాకర్ మాట్లాడుతూ కఠినమైన కేసుల పరిష్కారంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో ప్రధానంగా ఉంటుందని గుర్తుచేశారు. కార్యక్రమానికి సభాధ్యక్షుడుగా ఎండీ జిలాని వ్యవహరించగా సీనియర్ జర్నలిస్ట్ చాంద్ బాషా వందన సమర్పణ గావించారు.

మహిళలు దైవ ప్రేమ స్వరూపులు

విశాలాంధ్ర-గుంటూరు : ప్రభువైన ఏసుక్రీస్తు దృష్టిలో సృష్టికి ప్రతి సృష్టి ఇచ్చే దైవ స్వరూపులు మహిళలు మాత్రమేనని క్రాస్ మినిస్ట్రీస్ ట్రస్ట్ వ్యవస్థాపకులు పాస్టర్ జేమ్స్ భాస్కర్ అన్నారు. క్రాస్ మినిస్ట్రీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేట మహిళా మండలి ఓల్డ్ ఏజ్ హోంలో వృద్ధులకు నూతన వస్త్రాలతో పాటు ఆశ్రమానికి కావాల్సిన వంటపాత్రలు, టేబుల్స్, కంచాలు, కుర్చీలు, మిక్సీలు అందించడం తోపాటు వృద్ధులకు స్వయంగా భోజనం బిస్కెట్లు పండ్లు అందజేశారు. మహిమ మహిళ స్వయం సహాయక సంఘం సేవకురాలు ప్రేమకుమారి వంద సంవత్సరాలు నిండిన వృద్ధురాలు అన్నపూర్ణమ్మ, ఆశ్రమం సూపరెంట్ సరోజమ్మ, రిసోర్స్‌పర్సన్ నాగమ్మ, వలంటీర్ రాణిలను వస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో బాబురావు, డేవిడ్, రాజేంద్రప్రసాద్, శిల్పకుమారి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

'ఐ క్యాంప్'ను ప్రారంభించిన మాజేటి లక్ష్మి

విశాలాంధ్ర-గుంటూరు : అంతర్జాతీయ మహిళా దినోత్సవం, జోనల్ చైర్మన్ ఫ్రెండ్లీ విజిట్‌లో భాగంగా వాసవి క్లబ్ స్వర్ణపురి కపుల్స్, వాసవి క్లబ్ వనిత సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం పొన్నూరులో ఏర్పాటు చేసిన 'ఐ క్యాంప్'ను వాసవి క్లబ్స్ జోన్ చైర్‌పర్సన్-2 మాజేటి సౌభాగ్య లక్ష్మీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పొన్నూరు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ ఎన్.రాధా, ఆయా క్లబ్‌ల సభ్యులు పాల్గొన్నారు.

పోస్టాఫీసులో మహిళా దినోత్సవం

విశాలాంధ్ర-తెనాలి : కొత్తపేట హెడ్‌పోస్టాఫీసులో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. సభకు పోస్టల్ డివిజనల్ సూపరింటెండెంట్ కొల్లూరు రమేష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ శాసనసభ్యురాలు డాక్టర్ గోగినేని ఉమ మాట్లాడుతూ, మహిళా సాధికారత కోసం మహిళలు కృషి చేయాలన్నారు. పోస్టల్ మహిళా ఉద్యోగుల సేవలను కొనియాడారు. డివిజనల్ సూపరింటెండెంట్ కొల్లూరు రమేష్ మాట్లాడుతూ, మహిళా ఉద్యోగులకు పోస్టల్ శాఖ చేస్తున్న వెల్ఫేర్ గురించి వివరించారు. పోస్టల్ శాఖకు మహిళా ఉద్యోగులు చేస్తున్న సేవలను వివరించి కొనియాడారు. కార్యక్రమములో పోస్టల్ మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి - విజయవాడ

ఓ.యస్.నెం : 2023/2021

బిట్వీన్ :

పి.రఘునాథరెడ్డి - వాది

మరియు

ఆదూరి పాపిరెడ్డి - ప్రతివాది

ప్రతివాది : ఆదూరి పాపిరెడ్డి తండ్రి చిన్నపరెడ్డి ఆర్/ఓ డోర్ నెం:18-39-11, సంగడిగుట్ట, రెడ్లబజారు గుంటూరు, గుంటూరు జిల్లా.

పై నెంబరు దావాలో ప్రతివాదికి నోటీసు జారీ చేయునిమిత్తం శ్రీకోర్టువారు ప్రత్యామ్నాయ సర్వీసుగా పేపరు ప్రకటన ద్వారా నోటీసు ఆర్డరు వేసియున్నారు. కావున ప్రతివాది పై నెంబరు దావానందు **ది.14-03-2023 ఉదయం గం॥ 10.30ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయము గాని, మీ తరపు న్యాయవాది ద్వారా కాని హాజరై అభ్యంతరములు తెలియజేయగలరు లేని యెడల శ్రీకోర్టు వారు పరోక్షమున తీర్మానించెదరు.

వాయిదా తేది : 14-03-2023

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

పి.శ్రీనివాసు, అడ్వకేట్
గవర్నర్‌పేట, విజయవాడ
సెల్ : 9849770625

మహిళామణుల స్వయం కృషి మరువలేం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : అన్ని రంగాల్లోనూ అగ్రగణ్యులుగా రాణిస్తున్న మహిళామణుల స్వయం కృషి మరువలేమని నగేష్ మిత్ర మండలి కొనియాడింది. మహిళా దినోత్సవం సందర్భంగా మండలి ఆధ్వర్యంలో బుధవారం నగరపాలక సంస్థలో పని చేసే అయిదుగురు మహిళా పారిశుధ్య కార్మికులను శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండలి వ్యవస్థాపక అధ్యక్షులు, రమ పెయింట్స్ అధినేత నగేష్ ఖన్నా, కేంద్ర సహకార ఉద్యోగుల విశ్రాంత సంఘం గౌరవ అధ్యక్షుడు గురవారెడ్డి, మాజీ గ్రామ సర్పంచ్ సాంబిరెడ్డి, సీనియర్ న్యాయవాది ప్రసాదరావు, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సాంబశివరావు, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు ఆదినారాయణరావు, పొట్టి నాగేశ్వరావు, నాగిరెడ్డి, గుంటక శ్రీనివాసరెడ్డి, మెడికల్ ఉద్యోగుల సంఘం నేత బ్రహ్మారెడ్డి, లక్ష్మయ్య, కరుణాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయ మహిళలకు ప్రోత్సాహం అందించండి

విశాలాంధ్ర-గుంటూరు : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గుంటూరు జిల్లా ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీవో రిక్రియేషన్ హాల్‌లో బుధవారం మహిళా దినోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్ రాధా రాణి అధ్యక్షత వహించగా, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ జె.యాస్మిన్, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.ప్రభావతి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ సి.పద్మావతి దేవి, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు, కార్యదర్శి శెట్టిపల్లి సతీష్ కుమార్ హాజరయ్యారు. డాక్టర్ యాస్మిన్ మాట్లాడుతూ ప్రతి ఒక్క మహిళా ఉద్యోగి మరి కొంతమంది నిరాశ్రయులైన మహిళలకు ప్రోత్సాహం ఇవ్వాలని కోరారు. డాక్టర్ ఎన్.ప్రభావతి మాట్లాడుతూ మహిళ ఉద్యోగి ధైర్యంగా ముందుకు సాగాలని అన్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి దేవి మాట్లాడుతూ మహిళ ఉద్యోగుల విషయంలో అసోసియేషన్ సభ్యులు ఇస్తున్న ప్రోత్సాహాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ నాగూర్ షరీఫ్, జిల్లా మహిళ సంయుక్త కార్యదర్శి కె.శివ జ్యోతి, కె.రమ్య తదితరులు పాల్గొన్నారు.

ఆకాశం హద్దుగా మహిళలు ఎదగాలి

విశాలాంధ్ర-గుంటూరు : ఏపీటీఎఫ్ (1938) గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బిషప్ ఇగ్నేషియస్ యూపీ పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన మహిళా సన్మాన కార్యక్రమంనకు అధ్యక్షుడు గోవిందు వెలాంగణిరాజు అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి మేకల సుబ్బారావు మాట్లాడుతూ మహిళలు ఆకాశం హద్దుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఉత్తమ మహిళలు 18 మందిని విశిష్ట, సన్మాన, సత్కార కార్యక్రమం జరిగింది. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కట్టెబోయిన నర్సింహారావు, విజయానంద్, ఉగ్గం సాంబశివరావు, కైలాష్‌నాథ్, పి.రమేష్, మోపిదేవి శివశంకర రావు, రమారమి శ్రీనివాసరావు, చంద్రశేఖర్, వినుకొండయ్య, జోజప్ప, ప్రమీలరాణి, కె.సుధారాణి, జోజయ్య, శ్రీనివాసరావు, నాగార్జున, జి.గణేష్, ఎన్.ప్రసాద్, వేణుగోపాలరావు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికునికి ఆర్థికసాయం

విశాలాంధ్ర-దుగ్గిరాల : మండల పరిధిలోని చింతలపూడి గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు మల్లవరపు శివాంజినేయులుకు రూ.25 వేలు ఆర్థిక సహాయాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుల ద్వారా అందజేసారు. గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు శివాంజినేయులు తాను రోజు మాదిరిగా పనికి వెళ్లి ప్రమాదవశాత్తు రెండవ అంతస్తు నుంచి క్రిందపడి కాళ్లు చేతులు చచ్చుపడిపోయి. గత కొంతకాలం నుంచి ఇంటిలోనే ఉండడం వలన కుటుంబ పోషణ కూడా చాలా కష్టంగా ఉందన్న విషయాన్నీ స్థానిక వైసీపీ నాయకులు ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే అండగా నిలవాలని ఉద్దేశంతో రూ.25 వేలు ఆర్థిక సహాయాన్ని దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, స్థానిక వైసీపీ నాయకులు నల్లనూకల కోటి యాదవ్‌ల ద్వారా అందజేయించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు నల్లనూకల కోటి యాదవ్, దానబోయిన వెంకటేశ్వరరావు, దేసబోయిన లక్ష్మయ్య, డి.శ్రీనివాసరావు, రుద్రు గోపీ, డీవీఆర్, షేక్ జానీ బాషా, మెరుగ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అన్నింటా మహిళలు ముందంజ

విశాలాంధ్ర-తెనాలి : స్త్రీలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో పెద్ద ఎత్తున పాల్గొన్నప్పుడే ఒక దేశ సమగ్ర సంపూర్ణాభివృద్ధి, ప్రపంచ సంక్షేమం, శాంతి సౌభాగ్యాలు సాధ్యమవుతాయని వక్తలు పేర్కొన్నారు. తెనాలి గాంధీనగర్ బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్ హాలులో ఇస్కఫ్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం జరిగింది. సభకు ఇస్కఫ్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షురాలు బెజ్జంకి నాగమణి అధ్యక్షత వహించి మాట్లాడుతూ మహిళలు ఎక్కడ పూజింపబడతారో అక్కడ అభివృద్ధి పరిడవిల్లుతుందని పెద్దలు చెప్పిన మాటలను గుర్తు చేశారు. మహిళల కోసం, మహిళా అభివృద్ధి కోసం, మహిళలపై వివక్షత, అణిచివేత లేని సమాజం కోసం మహిళలు నిరంతరం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సమానత్వం సాధించడం దిశగా పోరాడుతూనే హక్కులను సాధించుకోవాలన్నారు. మహిళలు ఏకతాటిపై నిలబడి సమస్యల పరిష్కారం చేయాలని, గ్రామీణ మహిళలను కూడా ప్రతి కార్యక్రమంలో పాల్గొనేటట్లు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధ్యాయ సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ, సమానత్వం సాధించడం దిశగా పోరాడుతూనే హక్కులను సాధించుకోవాలని చెప్పారు. మహిళలు తమ హక్కుల కోసం స్థానిక ప్రాంతాల నుండి పోరాటాలు చేపట్టాలన్నారు. అభ్యుదయ మహిళా సంఘం అధ్యక్షురాలు జంగా లక్ష్మీరాజ్యం మాట్లాడుతూ, మహిళలు తమ హక్కుల కోసం పోరాడాలన్నారు. ఇస్కఫ్ ద్వారా మహిళా విభాగం ఏర్పాటు చేసి ప్రపంచ విశేషాలను అందరూ తెలుసుకోవాలని చెప్పారు. కొర్రపాటి నగరాజకుమారి, బుర్రకథకురాలు భానుమతి పాల్గొన్నారు.

అమరేశ్వరస్వామిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి

విశాలాంధ్ర-అమరావతి : ప్రముఖ పుణ్యక్షేత్రమైన అమరావతిలో కొలువుతీరివున్న శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి వార్లను హైకోర్టు జడ్జి బి.శ్యాంసుందర్ వారి కుటుంబ సభ్యులు బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం వారు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ అమరేశ్వర స్వామి వారికి అభిషేకము, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించిన అనంతరం వేద పండితులతో వేద ఆశీర్వచనం, స్వామి వారి శేష వస్త్రం, స్వామి వారి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి ఆలయ వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ సాధికారతే ధ్యేయంగా 'యువికా'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హోప్‌విన్ హాస్పిటల్స్ చైర్మన్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తాన 'యువికా'అనే మహిళా సాధికారికతకు తోడ్పడే ఎన్‌జీఓను ఘనంగా ప్రారంభించారు. తూర్పు వైసీపీ మహిళా నాయకురాలు నూరి ఫాతిమా ముఖ్య అతిథిగా పాల్గొని యువికా లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ షమ సుల్తాన మాట్లాడుతూ స్త్రీ సాధికారత ధ్యేయంగా ఆడవారు తమ కాళ్ళపై తాము నిలబడటానికి ఉన్న అవకాశాలను తెలియజేశారు. జీవనోపాధికి ఒక ఆధారాన్ని ఏర్పాటు చేసే లక్ష్యంతోనే ఈ 'యువికా'అనే ఎన్‌జీఓ స్థాపించడం జరిగిందన్నారు. యువికా ద్వారా మహిళలు తమ తమ కలలకు చేరువవుతారని అన్నారు. హోప్‌విన్ హాస్పిటల్స్ ఫౌండర్ డాక్టర్ నజీరుద్దీన్ యువికా-2023 అవార్డును డాక్టర్ షమ సుల్తానకు ప్రదానం చేశారు. హాస్పిటల్‌లో జరిగిన ఉచిత వైద్య శిబిరాన్ని సుమారు 200మంది మహిళలు ఉపయోగించుకున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ బషీరుద్దీన్, హోప్‌విన్ హాస్పిటల్స్ మేనేజనర్ పి.నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో దూసుకుపోతున్న మహిళలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : నేడు మహిళలు అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళ్తూ ఎన్నో అత్యుత్తమైన విజయాలు సాధించి దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొస్తున్నారని రమేష్ హాస్పటల్ డైరెక్టర్ డాక్టర్ రాయపాటి మమత కొనియాడారు. ఈ మేరకు బుధవారం గుంటూరు రమేష్ ఆసుపత్రిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన ఏడుగురు మహిళలను రమేష్ హాస్పిటల్ యాజమాన్యం ఘనంగా సన్మానించారు. అనంతరం డాక్టర్ రాయపాటి మమత మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ వహించాలన్నారు. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే సమాజం కూడా మరింత అభివృద్ధి దిశగా వెళుతుందన్నారు. మహిళలు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యల చికిత్సలో భాగంగా ప్రత్యేక ప్యాకేజీ ఆఫర్ ఇస్తున్నట్లు ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిత, డాక్టర్ సుప్రద, డాక్టర్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగివున్న సృజనాత్మకతను బయటికి తీయడానికి విద్య వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) రాష్ట్ర కోశాధికారి మేకల రవీంద్రబాబు పేర్కొన్నారు. స్థానిక పాత గుంటూరులోని వీఆర్ స్కూల్లో సైన్స్ ఎక్స్‌ఫో-2023ను రవీంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ వెలిశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఒకటి నుండి పదో తరగతి వరకు 120 ఎగ్జిబిట్స్‌ను కార్పొరేట్ స్థాయికి ధీటుగా విద్యార్థులు ప్రదర్శించారన్నారు. విజ్ఞాన, సాంఘీక, రసాయన, భౌతిక, పర్యావరణ, వృక్ష జంతు శాస్త్రానికి సంబంధించిన ప్రాజెక్టులు ప్రదర్శించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయ అతిథులుగా జిల్లా కోశాధికారి వంగా శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు బత్తిన వెంకటరావు, తూర్పు డివిజన్ అధ్యక్షులు బి.మల్లికార్జునరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు స్థానిక ప్రజలు హాజరై విద్యార్థులను ప్రశంసించారు.

పాత్రికేయ రంగంలో సైతం రాణిస్తున్న మహిళలు

విశాలాంధ్ర-గుంటూరు : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమి ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఉన్న విశిష్ట మహిళా పాత్రికేయులకు ఘన సన్మానం చేశారు. విజయవాడలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రెస్ అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు తదితరులు గత మూడు దశాబ్దాలుగా పాత్రికేయ రంగంలో విశిష్ట సేవలు అందిస్తూ ప్రస్తుతం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పాత్రికేయ విద్యా విభాగాధిపతిగా ఉన్న డాక్టర్ జి.అనితను సన్మానించారు. అన్ని రంగాలలో కంటే పాత్రికేయ రంగం బహుకష్టమైనదని, అయినప్పటికీ పురుషులతో సమానంగా విధులు నిర్వర్తిన్న మహిళా పాత్రికేయుల సేవలు అనిర్వచనీయమని అభినందించారు.

200వ రోజుకు అన్న క్యాంటిన్

విశాలాంధ్ర-తాడేపల్లి : టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రతిష్టాత్మకంగా తాడేపల్లి నులకపేటలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటిన్ బుధవారం 200వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అన్న క్యాంటిన్ సేవలు కొనసాగించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు, గుంటూరు పార్లమెంటు ఎస్సీ సెల్ కార్యదర్శి రామకృష్ణారావు, సీనియర్ నాయకులు మండవ గోపాలరావు, పట్టణ మాజీ అధ్యక్షులు ఇట్టా పెంచలయ్య, మంగళగిరి నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు ఇట్టా భాస్కర్, మంగళగిరి నియోజకవర్గ టీఎన్‌టీయూసీ అధ్యక్షులు కేటీవీ ప్రసాద్, తాడేపల్లి పట్టణ బీసీ సెల్ ఉపాధ్యక్షులు కంచర్ల శివప్రసాదరావు, తాడేపల్లి పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్‌కే చాంద్ బాషా, మంగళగిరి నియోజకవర్గ మైనార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ నాగుల్ మీరా, గుంటూరు పార్లమెంట్ టీఎన్ఎస్ఎఫ్ నాయకులు దర్శి హరికృష్ణ, తాడేపల్లి పట్టణ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు కంభం సాయి చంద్, తెలుగు యువత తాడేపల్లి పట్టణ అధ్యక్షులు గుద్దంటి నాగేశ్వరరావు, షేక్ అమీర్, బీసీ నాయకులు కాకుమాను కుమార్, షేక్ మస్తానయ్య, షేక్ ఇమ్రాన్, షేక్ ఇస్మాయిల్, షేక్ రియాజ్, బాబావలి, జిన్నాభాయ్, రిక్షా శీను, మోహన్, ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

సవాల్ స్వీకరించాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-నరసరావుపేట: ఎంఎల్ఏ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివా సరెడ్డి, టిడిపి ఇంచార్జీ డాక్టర్ చదలవాడ అరవింద బాబుల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. డాక్టర్ గోపిరెడ్డిపై డాక్టర్ అరవింద బాబు ఇటీవల చేసిన పలు ఆరోపణలపై ఎంఎల్ఏ గోపిరెడ్డి బుధవారం విలేఖరుల సమావేశంలో తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అసత్యాల అరవింద్ బాబు సత్యం తెలుసుకో అంటూ నీకు రాజకీయం తెలీదు, చెప్పిన అర్థం కాదు అన్నారు. సాక్ష్యాలు ఉంటే నా సవాల్ ను స్వీకరించి ముందుకు ...రా.. పిచ్చి ప్రేలాపనలు మాట్లాడుతూ ఉంటే ఇక చూస్తూ సహించేది లేదని హెచ్చరించారు.

బాలికలపట్ల అప్రమత్తంగా ఉండాలి...

విశాలాంధ్ర-రెంటచింతల: తల్లిదండ్రులు తమ పిల్ల లను పెంచడంలో అప్రమ త్తంగా ఉండాలని గురజాల ఎడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ మంజులత కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలలో పాల్గొన్నారు. మహిళ రక్షణ కోసం ప్రభుత్వం చేసిన చట్టాల పై అవగా హన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహలు, గ్రుహహింస, మనోవర్తి చట్టాలపై అవగాహన కలిగించాలి. అనంతరం సివిల్ జడ్జి మంజుల తాను ఘనంగా సన్మానించారు. సమావేశంలో ఎమ్పీపీ చౌడేశ్వరి, సరపంచ్ పుష్పావతి, అగణవాడి పర్యవేక్షాకురాలు మహలక్షమమ్మ, న్యాయవాదులు ప్రభుదాస్, జానీ బిషా తదితరులు పాల్గున్నారు. యు.టీ.ఎఫ్ ఉపాధ్యాయ సంగం ఆధ్వర్యంలో ఎస్‌టీ స్కుల్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలలో పలువురు మహిళ ఉపాధ్యాయయినిలు ఘనంగా సన్మానించారు.

నర్సింగ్ వృత్తి పవిత్రమైనది: గిరిజ

విశాలాంధ్ర-సత్తెనపల్లి: వైద్యవృత్తిలో భాగంగా నర్సింగ్ చాలా గొప్పది, పవిత్రమైనదని ప్రముఖ గైనకాలజిస్ట్ సంజన హాస్పిటల్స్ వ్యవస్థాపకురాలు డాక్టర్ గిరిజ పేర్కొన్నారు బుధవారం స్థానిక వేద కళాశాల 29వ వార్షికోత్సవం నర్సింగ్ విద్యార్థినులకు కాప్‌ల బహుకరణ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సభకు అకాడమిక్ డైరెక్టర్ చింతాడ సూర్యప్రకాష్ అధ్యక్షత వహించారు. ప్రముఖ వైద్యురాలు డాక్టర్ గజ్జెల శారదా రెడ్డి ప్రసంగిస్తూ తల్లితండ్రుల అసలకు అనుగుణంగా చదువుకొని ఉన్నతశిఖరాలను అధిరోహించాలన్నారు. పెదమక్కెన ప్రభుత్వ పశువైద్యురాలు శిరీష మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాలలో ముందుండాలన్నారు. ఆనెస్థీయ వైద్యురాలు ఫణిప్రశాంతి మాట్లాడుతూ లక్ష్యాలను ఎంచుకొని వాటి సాధనకోసం నిరంతరం కృషిచేయాలన్నారు. ప్రభుత్వ హాస్పిటల్ హెడ్ నర్స్ రమణమ్మ, యువ డాక్టర్ చింతాడ ప్రత్యూష నర్సింగ్ విద్యార్థినుల చేత ప్రమాణ చేయించారు. ఈ సందర్భంగా మహిళా అధ్యాపకులు డాక్టర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మహిళా డైరెక్టర్ ప్రభావతి, ప్రిన్సిపల్స్ సరితా, పద్మలత, సింధుషా, సైదా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులను బురిడీ కొట్టించిన దొంగ

విశాలాంధ్ర-గురజాల: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రిమాండ్ ఖైదీగా ఉన్న ఉద్దగిరి అలేఖ్య గత మూడు నెలల క్రితం చర్లగుడిపాడు గ్రామంలో దొంగ నోట్లు ముద్రిస్తుండడంతో పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో దాబాపై నుంచి దూకడంతో నిందితుడికి గాయాలయ్యాయి. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అనంతరం ప్రాథమిక వైద్యం కోసం గురజాల ఆసుపత్రికి తరలించి అతనికి వన్ ప్లస్ ఫోర్ సెక్యూరిటీ ఏర్పాటు చేశారు. అయితే మంగళవారం అర్ధరాత్రి సమయంలో పోలీసులు నమ్మ పలికే విధంగా మంచంపై మనిషి ఆకారంలో దిండ్లు ఏర్పాటు చేసి దుప్పటి కప్పి నిందితుడు తెల్లవారేసరికి వీల్ చైర్‌తో సహా పరారయ్యాడు. ఉదయాన్నే పోలీసులు నిందితున్ని నిద్రలేపేందుకు ప్రయత్నిం చగా దిండ్లు ఉండేసరికి ఒక్కసారిగా పోలీసులు కంగుతిన్నారు. సంఘటనపై ఏఆర్ డీఎస్పీ చిన్ని కృష్ణ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. గురజాల డిఎస్పీ జయరాం ప్రసాద్, సిఐ ప్రభాకర్ ఆసుపత్రిని పరిశీలించి నిందితుడి కుటుంబ సభ్యులను విచారించారు. ఆసుపత్రి సమీపంలోని సీసీ టివి ఫుటేజీ పరిశీలించారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యాట్మింటన్ జట్టు ఎంపిక

విశాలాంధ్ర-శావల్యాపురం: క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జట్టుకు మంచి పేరు తీసుకావాలని గుంటూరు జిల్లా బాల్ బ్యాట్మింటన్ సెక్రటరీ శివశంకర్ అన్నారు. గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 19 ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యాడ్మింటన్ జట్టును బుధవారం మండల కేంద్రం శావల్యాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపిక చేశారు. ఈసందర్భంగా పిడి రాగుల రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఈనెల 17వ తేది నుండి 19 తేది వరకు నెల్లూరు జిల్లా కావలిలో జరిగే 7వ అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొనేందుకు ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు లఖిత(కనమర్లపూడి), నజీయా(పసుమర్రు), సమీరా, స్రవంతి, లూధియా, దివ్య, బసవరాణి, దేవమణి, కావ్య(శావల్యాపురం), అమూల్య(నరసరావుపేట), స్టాండ్ బైగా అంజన(శావల్యాపురం), హర్షిత (శావల్యాపురం), రవళిల(శావల్యాపురం)ను ఎంపిక చేసినట్లు తెలిపారు.

సీనియర్ నాయకుడ్ని కోల్పోవడం బాధాకరం

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : అచ్చంపేట మండల పరిధిలోని చిగురుపాడు గ్రామానికి చెందిన 63వ బూత్ కన్వీనర్ ఏసూపోగు రాంబాబు తండ్రి యేసు గుండెపోటుతో మృతి చెందగా, విషయం నాయకులు ద్వారా తెలుసుకున్న పెదకూరపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ శాసనసభ్యులు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ ఆయన కుమారుడైన రాంబాబుతో ఫోన్ ద్వారా తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నాయకుల ద్వారా వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. యేసు భౌతికకాయానికి రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు నల్లమేకల వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షులు నందిగం ఆశీర్వాదం, మాజీ సర్పంచ్ దుద్దుల విజయకుమార్, చిమట శ్రీనివాసరావు, జిల్లా ఎస్సీ సెల్ నాయకులు రేపూడి తామస్, ఏసుపోగు నాగయ్య, సందెపోగు స్వామియేలు, కొమ్మవరపు దిబ్బయ్య తదితరులు నివాళులర్పించారు.

చిలక లక్ష్మయ్య మృతి బాధాకరం

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : అచ్చంపేట మండల పరిధిలోని గంధసిరి గ్రామానికి చెందిన మండల వైసీపీ నాయకులు చిలక లక్ష్మయ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే నంబూరు శంకరరావు లక్ష్మయ్య భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. శంకరరావు మాట్లాడుతూ అచ్చంపేట మండలంలో గంధసిరిలో వైసీపీ మంచి నాయకుడిగా ఎదిగిన లక్ష్మయ్య చనిపోవడం వైసీపీ పార్టీకి తీరని లోటని ఆయన అన్నారు. నివాళులర్పించిన వారిలో క్రోసూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, అచ్చంపేట జడ్పీటీసీ సభ్యులు ప్రతాప్ రెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ చిలక చంద్రయ్య తదితరులు ఉన్నారు.

ఏఐటీయూసీ కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవం

విశాలాంధ్ర-నరసరావుపేట : అన్ని వర్గాల మహిళలు తమ హక్కుల కోసం రాజకీయాలకతీతంగా సంఘటితమై పోరాడా లని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ రాష్ట్ర అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం నరసరావుపేట పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ స్టేట్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ జె.హెల్డా ఫ్లోరెన్స్ అధ్యక్షతన జరిగిన మహిళా దినో త్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై దాడులు అత్యాచారాలు పెరిగిపోయాయని పాల కులు అనేక చట్టాలు చేస్తున్నామని చెప్పినప్పటికీ అమలులో శూన్యం అన్నారు. రాష్ట్రంలో ప్రధానంగా గంజాయి హెరా యిన్ లాంటి మత్తు పదార్థాలు విపరీతంగా దొరుకుతున్నా యని, ఇటీవల కాలంలో డ్రగ్స్ కేసులు ఎక్కువయ్యాయని ప్రభుత్వం నడుపుతున్న బ్రాందీ, సారా కొట్లు విచ్చలవిడిగా పెరిగిపోయాయని మత్తు పదార్థాలకు బానిసలు అయిన యువకులు మహిళలపై దాడులకు అత్యాచారాలకు పూనుకుంటున్నారని ఇది పూర్తిగా ప్రభుత్వాల వైఫల్యమేనని ఆమె అన్నారు. రాష్ట్రం నుంచి మత్తు పదార్థాలను తరిమికొట్టేందుకు మహిళలు సంఘటితమై పోరాటాలకు ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. బీఆర్ కాలేజీ లెక్చరర్ అమృత, కస్తూరిబా స్కూల్ పీఈటీ వై.రాణి, ఆశ వర్కర్ యూనియన్ లీడర్ ఎల్.శాంతి తదితరులు మాట్లాడుతూ దేశంలో అభివృద్ధికి పురుషులతోపాటు మహిళలు కూడా సమాన పాత్ర పోషిస్తున్నారని శ్రామిక మహిళలు ఉద్యోగుల శ్రమ దోపిడి జరుగుతోందని దీనిని అరికట్టేందుకు మహిళలు ఉద్యమించాలని కోరారు. ప్రముఖ సీనియర్ వైద్యులు సిహెచ్ గౌతమి మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రంలో విచ్చలవిడిగా దొరుకుతున్న డ్రగ్స్‌ను పూర్తిగా నిషేధించాలని డ్రగ్స్, గంజాయి మత్తుపదార్థాలను విక్రయి స్తున్న ట్రాన్స్‌పోర్ట్ చేస్తున్న దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రధానంగా కాలేజీలలో విద్యార్థినులు మత్తుపదార్థాలకు బానిసలు అయిన యువకుల చేతులలో బలైపోతున్నారని వారి అరాచకాన్ని తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వీటిని నిరోధించుటలో ప్రభుత్వం పోలీసులే తగిన కార్యాచరణ తీసుకోవాలని ఆమె కోరారు. సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో మహిళలు సమాన పాత్ర పోషిస్తున్నారని, ఈ రోజున అన్ని రంగాలలో మహిళ ఉద్యోగులు షాపులలో గుమస్తాలుగా, ఆర్టీసీలో కండక్టర్లుగా, పోలీసు ఉద్యోగాలలో అధికారుల నుంచి కానిస్టేబుల్ వరకు, విమానాలు నడుపుటలో పైలెట్‌గా, ఆటోలు నడుపుతూ చివ రకు కూలికి వెళుతూ కుటుంబాల పోషణలో అగ్రగామిగా సాహసోపేతమైన పాత్ర నిర్వహిస్తూ కుటుంబాలను పోషిస్తూ కాపాడుకుంటున్నారని అన్నారు. భారతదేశ సరిహద్దుల్లో నేవీలో సైన్యంలో కూడా మహిళల పాత్ర అద్వితీయమైనదని ఆయన అన్నారు. స్త్రీ లేనిదే జననం లేదని స్త్రీ లేనిదే సృష్టి లేదని, సమాజం లేదని అటువంటి స్త్రీపై జరుగుతున్న దాడులు అత్యాచారాలను నిలువరించుటలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని మహిళా హక్కుల కోసం మహిళలపై జరుగుతున్న దాడులను నిలువరించడానికి సంఘటితమై పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన అన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ మహిళలు, మహిళా కార్మికులు శ్రమ దోపిడీపై ఉద్యోగ భద్రతకై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పాల్గొన్న మహిళలకు స్వచ్ఛంద సంస్థ మద్దుకూరి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మద్దుకూరు అశోక్ ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు బ్యాగులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న రుగ్మతలను ఎదిరించుటకు మహిళలు సైంటిఫిక్‌గా ఆలోచించాలని మూఢనమ్మకాలను వదిలి పెట్టాలని మహిళల అభివృద్ధికై మా ఫౌండేషన్ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని ప్రజలను చైతన్యం చేయడమే ధ్యేయంగా మా సంస్థ పనిచేస్తుందని అన్నారు. మహిళా సమాఖ్య నాయకులు పద్మ ఝాన్సీ, దేవి, కావేరి, కళావతి, విజయలక్ష్మి, విజయ, షాహినా, రమాదేవి ఏఐటీయూసీ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, వైదన వెంకట్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి: కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట: మారిన ఆధునిక సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించడా నికి ఉన్న అపార అవకాశాలను అందిపుచ్చు కోవాలని పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి పిలుపు నిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలోని భువనచంద్ర టౌన్ హాల్ నందు రమణీ యంగా జరిగాయి. కోవిద సహృదయ ఫౌండేషన్ సంస్థ ఏర్పాటు చేసిన సావిత్రి బాయి పూలే ఆదర్శ మహిళ సేవ అవార్డుల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతి థిగా హాజరయ్యారు. ప్రత్యేక అతిథిగా నరసరావుపేట పార్లమెంటు సభ్యులు శ్రీకృష్ణ దేవరాయలు, శాసన మండలి సభ్యులు జంగా కృష్ణమూర్తి, నరసరావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీని వాసరెడ్డి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో హాజరై సమాజంలో మహిళల ప్రాధాన్యతను ప్రస్తావిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పూర్వం తొలి దశలో మహిళల ఆధిపత్యంలోనే సమాజం నడిచిందన్నారు. మధ్య యుగంలో పురుషుల ఆధిక్యత పెరగడం వల్ల మహిళల ప్రాధాన్యత క్రమంగా తగ్గుతూ వచ్చింది అన్నారు. భవిష్యత్తు తరాలకు మహిళలే మార్గదర్శకం కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ భవిష్యత్తులో దేశ ప్రగతికి మహిళలు ప్రముఖ పాత్ర పోషిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అమెరికా రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన సావిత్రిబాయి పూలే ఆదర్శ మహిళ సేవా అవార్డులను పలువురు జిల్లా అధికా రిణిలకు అందజేసి ఘనంగా సత్కరించారు. పల్నాడు జిల్లా అభివృద్ధి మండల చైర్మన్ మిట్టపల్లి రమేష్, ఆయా శాఖల జిల్లా అధికారిణిలు, అధికారులు పాల్గొన్నారు.

మహిళలు అన్నింటా ముందుండాలి: సీపీఐ

విశాలాంధ్ర-చిలకలూరిపేట: పోరాడి సాధించుకున్న శ్రామిక మహిళా పోరాటం స్ఫూర్తిగా తీసుకుని అన్ని రంగాల్లో స్త్రీ ముందుండాలని సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామసుబ్బాయమ్మ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఏపీ మహిళా సమాఖ్య, చిలకలూ రిపేట ఏరియా శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని గడి యారస్థలం సెంటర్‌లో ఉన్న ఏపీ మహిళా సమాఖ్య ఉభయ రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు, అభ్యుదయ కవియిత్రి స్వర్గీయ వాణి రంగారావు విగ్రహం వద్ద బుధవారం వద్ద నిర్వహించారు. ముందుగా వాణి రంగారావు విగ్రహానికి మహిళా సమాఖ్య కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల పూలమా లలు వేసి నివాళులు అర్పించారు. మహిళా సమాఖ్య జండాను ఆవిష్కరించిన నాగబైరు రామసుబ్బాయమ్మ మాట్లాడుతూ పాఠశాల బాలిక నుంచి కళాశాలల విద్యార్థినుల వరకు, ఉద్యోగాలకు వెళ్లే మహిళలు వరకు అన్ని రంగాల్లో ఉన్న మహిళలు ప్రతి నిత్యం ఎన్నో రకాల సమస్యలు ఎదుర్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్త్రీకి అన్ని విషయాల్లో సమానత్వం ఉండాలని నాయకులు సమావేశాల్లో చెబుతుంటారని అయితే అవి మాటలకే పరిమితం అవుతున్నాయన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఏవైనా మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు కల్పించటంలో విఫలమయ్యాని ఆరోపిం చారు. ఏపీ మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల మాట్లాడుతూ పురుషాధ్యికత నుంచి స్త్రీలకు స్వేచ్ఛ, ఆర్థిక, రాజకీయ సమానత్వానికి చట్టాలు తీసుకొచ్చినా ఇంకా పోరాటాలు చేయక తప్పడం లేద న్నారు. మహిళలు అంతరిక్షం నుంచి కుటుంబం దాకా సాధించిన ప్రగతి ఒక్క రోజులో సాధ్యం కాలేదన్నారు. ఎన్నో దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న విజయ మిదని, దీన్ని వేడుకలా కాకుండా పోరాటస్ఫూర్తిగా తీసుకొని మహిళలు ముందుకు అడుగువేయాలని పిలుపునిచ్చారు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఉన్నత శిఖరాల్లో నిలిచిన మహిళకు ఇంకా లింగ వివక్ష, హింస, దురాగతాలు తప్పడం లేదని తెలిపారు. పట్టణ మహిళా సమైక్య కార్యదర్శి బి లలితకుమారి, నాయకులు సుజాత, తోట నరసమ్మ కుసుమకుమారి, కోమలి, మహాలక్ష్మి, రమాదేవి, వెంకటేశ్వరమ్మ, దుర్గ, నాగేశ్వరమ్మ, సామ్రాజ్యం, విజయలక్ష్మి, సీపీఐఐ నాయకులు నాయుడు శివకుమార్, మూసాబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి

విశాలాంధ్ర-నూజెండ్ల : రైతాంగ సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము అన్నారు. మండలంలోని పెద్దవరం, మృత్యుంజయపురం, సీతారాంపురం, చింతలచెరువు గ్రామాలలో ఈ నెల 16వ తేదీన ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం రాత్రి ఆయా గ్రామాలలో కరపత్రాలను పంచుతూ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ 16వ తేదీన వినుకొండ పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో హనుమాన్ నగర్ 11వ లైను ఎదురు గల కళ్యాణ మండపంలో కౌలు రైతుల సమస్యలపై మహాసభ నిర్వహిస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా సుదీర్ఘకాలం రైతులు పోరాటం చేసి విజయం సాధించుకున్నారన్నారు. నేడు వ్యవసాయ రంగంలో వస్తున్న సమస్యలపై, సమరశీలంగా పోరాడుతున్న సంఘం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మాత్రమేనన్నారు. మండలం నలుమూలల నుంచి అత్యధికంగా రైతులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూజెండ్ల మండల కార్యదర్శి అప్పరాజు పవన్ కుమార్, కొప్పరపు మల్లికార్జునరావు, సంపత్ పిచ్చయ్య, దూదేకుల కాసిం, బంక రంగయ్య, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సామూహిక శ్రీమంతాలు

విశాలాంధ్ర-పిడుగురాళ్ళ : మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పల్నాడు ఒయాసిస్‌లో చింతలపూడి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 28 మంది గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వివిధ హోదాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న మహిళలు హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ధనలక్ష్మి అంగన్వాడి సూపర్వైజర్ నాగమణి లాయర్ నవ్య చారిడ్ అకౌంటెంట్ స్నేహలను పల్నాడు హాస్పిటల్ డాక్టర్ చింతలపూడి రమ్యహారిక అశోక్ కుమార్ దంపతులు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా శ్రీమంతం జరిపించుకున్న వారు మాట్లాడుతూ మాకు శ్రీమంత కార్యక్రమం చేసుకోవాలని ఉన్న పేదరికం వల్ల చేసుకోలేని పరిస్థితుల్లో మా కోరిక తీరదనే అనుకున్నాం. అలాంటి సమయంలో మేమున్నామంటూ భరోసా కల్పిస్తూ చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్ వారు ముందుకు రావడం మాకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం అల్లాడి హాస్పిటల్ డాక్టర్ రమేహారిక మాట్లాడుతూ వైద్యపరంగా ఎలాంటి అవసరం వచ్చిన సేవ చేసేందుకు ఆమె ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు తమ ద్వారా జరుగుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. అల్లాడు ప్రాంతంలో పేద ఇంటి ఆడపిల్లలు ఎవరైనా పెళ్లి చేసుకోవాలంటే వారికి తమ వంతుగా కళ్యాణ కానుక రూపంలో తాళిబొట్టు, చీర, గాజులు, పసుపు, కుంకుమ, పండ్లు అందజేస్తామని తెలిపారు.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-రొంపిచర్ల: మండలంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండలంలో ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే మహిళా ఉద్యోగులను సన్మానించారు. మండలంలో విప్పర్ల గ్రామంలో గల ఎస్సి కాలనీలో జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జలజీవన్ మిషన్ మండల కో-ఆర్డినేటర్ బాబూరావు, డిబ్ల్యుఎస్ సి రమేష్ మాట్లాడుతూ మహిళా దినోత్సవ వేడుకలు గురించి, మహిళలు అన్ని రంగాల్లో సాధిస్తున్న విజయాలు గురించి, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. అదే విధంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో స్థానిక ఎస్‌బిఐ బ్యాంకు మేనేజర్ నాగలక్ష్మిని గ్రామపెద్దలు, డ్వాక్రా మహిళలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవమును పురస్కరించుకుని తనను సన్మానించిన వారికి మేనేజర్ నాగలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. బ్యాంకు ద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నాని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గెల్లి సుబ్బారెడ్డి, బిసి సంక్షేమ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సరికొండ తిమ్మరాజు, మండల నాయకులు ముక్కడాల వెంకటేశ్వరరావు,ఆర్యవైశ్య సంఘం మండల నాయకులు గొడవర్తి వెంకటేశ్వర్లు, పసుమర్తి ఆదినారాయణ, అర్వపల్లి విశ్వేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బల్లలు ధ్వంసం చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-వినుకొండ: ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో శివశక్తి బల్లలు ధ్వంసం చేసిన వారిని గుర్తించి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు వినుకొండ పట్టణ సి.ఐని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ప్రజా ప్రయోజనాల దృష్ట్యా పాదచారులు, క్రీడాకారులు కూర్చొనేందుకు శివశక్తి లీలా ఆంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిమెంట్ బల్లాలు ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి కొంత మంది సంఘ విద్రోహశక్తులు బల్లలు ధ్వంసం చేసారు. గతంలో అనేక పర్యాయాలు వివిధ స్థలాల్లో బల్లలను విరగకొట్టారు. ఈ విషయంపైనా న్యాయ విచారణ చేసి దోషులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం వినుకొండ పట్టణ సీఐ.ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు పి.వి.సురేష్ బాబు, శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ మేనేజర్ జి.వి.రమణారావు, రాష్ట్ర టిడిపి కార్యదర్శి షమీం ఖాన్, సీనియర్ నాయకులు పత్తి పూర్ణ చంద్రరావు, సౌదగర్ జానీ భాష పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కళ్యాణం

విశాలాంధ్ర-శావల్యాపురం : మండలంలోని వేల్పూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ భూసమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి కల్యాణం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు దివి మారుతి రామాచార్యులు, తిరుపతి వేద పాఠశాల పండితులు రత్నాకర్, సాయి మాధవాచార్యులు, వెంకట శేషాచార్యులు, సాత్వి కేలు స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు జరిపించి ప్రత్యేక అలంకరణలో స్వామివారిని పీటలపై కూర్చోబెట్టారు. అనంతరం వేదమంత్రాలు, మేళతాళాలు, భక్తజనం నడుమ స్వామి కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యా ణాన్ని తిలకించారు. అనంతరం కమిటీ సభ్యులు భక్తులు అన్నప్రసాదం అందజేశారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుకు

విశాలాంధ్ర-అమరావతి : మహి ళలు దేశప్రగతితో పాటు అన్ని రంగాల్లో పురుషులతో పోటీ పడ డమే కాదు పురుషుల కన్న అన్ని విధాల ముందుకు వెళుతున్నారని పెదకూ రపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి నంబూరు వసంతకుమారి అన్నారు. అమరావతి మండల పరిషత్ ఆధ్వర్యంలో ఎంపీడీవో మాధురి నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం రామకృష్ణ హిందూ హైస్కూల్‌లో జరిగింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో వసంతకుమారి పాల్గొని మహిళలకు నిర్వహించిన ఆటల పోటీలను ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు స్థానిక ఎంపీడీఓ మాధురి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మి సుశీల రాణి, అమరావతి జడ్పీటీసీ కరుణ కుమారి, అమరావతి సర్పంచ్ రాజేశ్వరి, ధరణికోట సర్పంచ్ మాదాసు పావని, అమరావతి వైస్ ఎంపీపీ లక్ష్మి శ్రీనివాస్ రెడ్డి, గుంటూరు కుమారి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఓబీసీ మహిళా సంక్షేమ సంఘం కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర-మాచర్ల: పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాలలో రాణించాలని వైఎస్ ఆర్పీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి అన్నారు. పల్నాడు జిల్లా ఓబీసీ మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు గంజర్ల ఆది లక్ష్మీ ఆధ్వర్యంలో శ్రీశైలం రోడ్డులో ఏర్పాటుచేసిన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. వెంకటరా మిరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి బీసీలకు రాజకీయాలలో సముచిత స్థానం కల్పించారన్నారు. దేశంలో ఎక్కడా కేటాయించని విధంగా మన రాష్ట్రంలో మహిళలు రాజకీయంగా చైతన్యం పొందేందుకు ఎన్నో ఉన్నత పదవులు కేటాయించిన ఘనత సీఎం జగన్ కే దక్కుతుంద న్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయ చరిత్రలో మహిళలకు హోంశాఖ పదవులు ఇచ్చిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందన్నారు. నియోజక వర్గంలో ఓబీసీ మహిళా సంక్షేమ సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షురాలు గంజర్ల లక్ష్మీ చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. ముందుగా పిన్నెల్లి వెంకటరామిరెడ్డి కేక్ కట్ చేశారు. అనంతరం బీసీ సంఘం మహిళలు ఆయనను ఘనంగా పూలమా లలు, దుశ్యాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా సెక్రటరీ షేక్ సబీనాబీబి, నియోజక వర్గ అధ్యక్షురాలు పిన్నింటి భవాని, మాచర్ల మండల అధ్యక్షురాలు మేకపోతుల నాగలక్ష్మి, ప్రధాన కార్య దర్శి కంచర్ల భారతి, కార్యదర్శి పులిచర్ల సుజాత, రూరల్ ప్రధాన కార్యదర్శి షేక్ ముంతాజ్ బేగం, కార్యదర్శి షేక్ కాసులు,పల్నాడు జిల్లా యూత్ అధ్యక్షుడు బొబ్బే సర్వేశ్వరరావు, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు బొబ్బే మునినారాయణ, దుర్గి మండల అధ్యక్ష కార్యదర్శులు పొల్లా నాగేంద్రబాబు, దొడ్డ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళ దినోత్సవ వేడుకలు...

విశాలాంధ్ర-వినుకొండ: మహిళాభ్యుద యంతోనే సమాజాభివృద్ధి సాధ్యమని మహిళా సమైక్య నాయకురాలు వేల్పూరి రాజేశ్వరి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని శివయ్య భవన్లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళా సమాఖ్య నాయక ురాలు మాదాసు ఝాన్సీ రాణి అధ్యక్షతన వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాజేశ్వరి మాట్లాడుతూ పురుషులతో పాటు మహిళలకు సమాన హక్కులు కల్పించాలని, ప్రస్తుత సమాజంలో మహిళలపై జరుగుతున్న హింసను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. మహిళా దినోత్సవం రోజు మాత్రమే మహిళలను గౌరవించడం కాకుండా ప్రతి రోజూ మహిళల పట్ల విధేయత చూపాలన్నారు. మహిళల పట్ల నేటికీ సమాజంలో ఇంకా పలు రుగ్మతలు ఉన్నాయని, గతంకంటే నేడు ఎన్నో మార్పులు వచ్చినా ఇంకా రావాల్సి ఉందన్నారు. మహిళలు సమైక్యంగా, సమన్వయంతో ఉంటేనే తమ హక్కుల సాధనకు మార్గం ఏర్పడుతుందని, ప్రతీ విజయం వెనుక స్త్రీ పాత్ర ఎంతో కీలకమన్నారు. అనంతరం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మహిళలను శాలువా పూలదండ లతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, ఏఐటీయూసీ నాయకులు వెంకటేశ్వర్లు, మల్లికార్జున, నూలి పుల్లయ్య, విజయ, రాణి, జయంతి. సునీత కుమారి తదితరులు పాల్గొన్నారు.

వినుకొండ: అంతర్జాతీయ మహిళ దినోత్సవం సంద ర్భంగా బుధవారం విను కొండ పోలీస్ స్టేషన్‌లో మహిళ ఎస్సై రాజ్యలక్ష్మితో పాటు మహిళ పోలీసులను వినుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ అశోక్ బాబు, రైటర్ దుర్గారావు, హెడ్ కానిస్టేబుల్ ప్రసాదు, సేవా నాయక్, అప్పలనాయుడు, బాజీ, భాస్కర్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ అశోక్ బాబు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, దానికి మహిళా ఎస్సై రాజ్యలక్ష్మి నిదర్శమని అన్నారు. అమ్మాయిలను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తే లింగ సమానత్వం సాధించడమే కాకుండా స్త్రీ సాధికారత జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

వినుకొండ: పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేక రుల సమావేశంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ద్వారా మహిళలకు పెద్దపీట వేశామని, మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని, వారికి ఉద్యోగ పరంగా వారికి తగిన రిజర్వేషన్ లను కేటాయిస్తూ, రాజకీయ పరంగా కూడా 50 శాతం రిజర్వేషన్‌లను కల్పిస్తూ ప్రభుత్వం ద్వారా వారికి తగిన గౌరవాన్ని కల్పించామని తెలిపారు. మహిళా భద్రత కోసం దిశా చట్టాలను తీసుకొచ్చి ప్రత్యేక యాప్‌లను రూపొందించి వారికి మెరుగైన భద్రత కల్పించామని తెలిపారు.

వినుకొండ: స్థానిక గీతాంజలి స్కూల్స్‌లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మున్సిపల్ చైర్ పర్సన్ షకీలా మహిళలు అందరికి శు భాకాంక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని, గాంధీజీ చెప్పినట్లు స్త్రీ అర్ధరాత్రి ఒంటరిగా రోడ్డు పైకి రాగలిగిన రోజునే పూర్తి స్వాతంత్రం సిద్ధించినట్లని పేర్కొన్నారు. తాను కూడా ఎన్నో కష్టాలను ఎదుర్కొని ఈ రోజు ఈ స్థాయికి వచ్చానని కాబట్టి ప్రతి ఒక్క స్త్రీ కష్టపడి మంచి స్థితికి రావాలని పిలుపునిచ్చారు. గత రెండు రోజులుగా పాఠశాలలో విద్యార్థుల తల్లులకు నిర్వహించిన వివిధ పోటీలలో విజేతల కు బహుమతులు అందచేశారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో డైరెక్టర్ శేషగిరిరావు, కరస్పాండెంట్ కిషోర్, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు గోపయ్య సమేత శ్రీలక్ష్మి తిరుపతమ్మ తిరునాళ్ల

విశాలాంధ్ర-శావల్యాపురం : పోట్లూరు పంచాయతీ శివారు కిష్టాపురం సమీపంలోని అద్దంకి బ్రాంచి కెనాల్ వద్ద వేంచేసి ఉన్న గోపయ్య సమేత శ్రీలక్ష్మి తిరుపతమ్మ అమ్మవార్ల తిరునాళ్ల మహోత్సవం గురువారం నిర్వహిస్తున్నామని ఆలయ ధర్మకర్త గోనుగుంట్ల వెంకట్రావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయాన్నే అమ్మ వారికి ప్రత్యేక పూజలు, పొంగళ్లుచేసి భక్తులు తమ మొక్కుబడులను తీర్చుకుంటారని తెలిపారు.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - రేపల్లె : అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు పట్టణంలోని పలు కార్యాలయాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ అద్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళా న్యాయమూర్తిని సన్మానించారు. ఎంసిఏలో ఏర్పాటు చేసిన మహిళ దినోత్సవ వేడుకల్లో ఉపాధ్యాయురాలు పద్మావతిని సన్మానించారు. ఈ సందర్భంగా మహిళలు సాధించిన విజయాలను చర్చించారు. కార్యక్రమంలో న్యాయ సేవాదికార సంస్థ సభ్యులు, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

పర్చూరు: మహిళా సాధికారిత, సమానత్వం, స్వయంశక్తితో సమాజ అభివృద్ధి జరుగుతుందని అని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎం.కుముదుని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకొని బుధవారం స్త్రీ, శిశు సంక్షేమ, అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి. న్యాయమూర్తి కుముదుని మహిళల సేవలను కొనియాడారు. సిడిపిఓ సుభద్ర, సూపర్‌వైజర్లు, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. పర్చూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఆరోగ్య కార్యకర్తలకు ఏకరూప దుస్తులను పంపిణీ చేసి నర్సుల సేవలను కొనియాడారు. రోగులకు పండ్లు, రొట్టెలు అందించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు నాగభైరు శ్రీనివాసరావు, పంబి సదానందరెడ్డి, ప్రతినిధులు కోటా శ్రీనివాసరావు, రావి సత్యనారాయణ, గడ్డిపాటి శ్రీనివాసరావు, కాసా అశోక్, కోమటి ఆంజనేయులు, పాబోలు వెంకన్న, చంద్రశేఖరరావు, వైద్యులు గురుమహేశ్వరరెడ్డి, సింధు, సునీత, ఫార్మాసిస్టు మాధవి, హెడ్ నర్సు రత్నకుమారి, సిబ్బంది ఉన్నారు. డీఆర్‌డీఏ వైస్సార్ క్రాంతిపదం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించి సన్మానించారు. కార్యక్రమంలో ఏపిఎం లాజరు, సీసీలు, మహిళా సమైఖ్య సభ్యులు పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు పాఠశాలల్లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

బాపట్ల రూరల్ : తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ ఇంచార్జీ వేగేశన నరేంద్రవర్మ నియోజకవర్గంలోని వివిధ రంగాలలో రాణిస్తున్న చంద్రపాటి సూర్యప్రభ (సంగీతం టీచర్), నాదస్వరా విద్వాంసురాలు ఏ.విజయలక్ష్మి, గొప్ప రచయిత్రి డా. సి.భవాని దేవి, యోగ ట్రైనర్ మానం మల్లేశ్వరి, భీమవారిపాలెంకు చెందిన యోగ గురువు ధూళిపాళ్ల శైలజను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానం విజేత, బాపట్ల పార్లమెంటరీ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ, బాపట్ల మాజీ చైర్పర్సన్ జిట్టా ప్రమీల, బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మహిళా అధ్యక్షులు పాల్గొన్నారు.

గ్లోబల్ ఇన్‌వెస్టర్స్ సమ్మిట్ విజయవంతం

విశాలాంధ్ర-పర్చూరు: రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు నిర్వహించిన గ్లోబల్ ఇన్‌వెస్టర్స్ సమ్మిట్ విజయవంతం అయిందని పర్చూరు వైసీపీ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ తెలిపారు. వైసీపీ కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ లక్షల కోట్ల పెట్టుబడితో పరిశ్రమలు స్థాపిస్తే.. ఉద్యోగ కల్పన జరుగుతుందని, రాష్ట్ర అభివృద్ధికి పరిశ్రమలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ చుండి సుజ్ఞానమ్మ, ఎంపిపి మేకా ఆనందకుమారి, సర్పంచ్ మల్లా అంజమ్మ, పార్టీనాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

తిరునాళ్ళ ఆదాయం రూ.34లక్షలు

విశాలాంధ్ర-అద్దంకి : సింగరకొండ శ్రీప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ళ సందర్భంగా భక్తులు హుండీ ద్వారా సమర్పించు కున్న కానుకలను దేవ స్థానం అధికారులు బుధ వారం లెక్కించారు. టికెట్లు, ప్రసాదాలు, హుండీ విరాళాలు లెక్కించగా రూ 34లక్షల21వెయ్యి 55రూపాయలు ఆదాయం వచ్చినట్లు దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ టి.సుభద్ర తెలిపారు. గత ఏడాది తిరునాళ్ళకు రూ.37,74,715 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఇక కొండపైనున్న శ్రీలక్ష్మినరశింహస్వామి దేవస్థానానికి తిరునాళ్ళకు రూ.1,05,396 ఆదాయం వచ్చినట్లు ఈవో కోటిరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : బాపట్ల కంకటపాలెం రోడ్డులో కారు బైక్ ఢీ కొన్న సంఘటనలో బైక్ మీద ప్రయాణి స్తున్న తమ్మిశెట్టి నాగేశ్వరావు (62) అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్సై వెంకటప్రసాద్ ప్రమాద సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి పోస్టుమార్టమ్ నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'50 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించే అవకాశం దక్కింది'

ఎమ్మెల్యే కోన రఘుపతి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ముఖ్యమంత్రి వైస్ జగన్మోహన్ రెడ్డి మహిళ పక్షపతిగా, మహిళలపై తనకున్న ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకునేందుకు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 50 శాతం మహిళ రిజర్వేషన్ బిల్లును ఆమోదించే సువర్ణ అవకాశం నాకే దక్కిందని మాజీ డిప్యూటీ స్పీకర్ కొన రఘుపతి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 24వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 15వ సచివాలయం ఇమ్మడిశెట్టివారిపాలెం కోనకు మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భారీ కేకును ఏర్పాటు చేసి అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలను ఉద్దేశించి కోన మాట్లాడుతూ మహిళలు వినూత్న శక్తి కలిగిన దైవ స్వరూపాలని కొనియాడారు. నేటి సమాజానికి మహిళ యొక్క ప్రాధాన్యతను తెలియజేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపడుతున్నటువంటి ప్రతి కార్యక్రమంలోనూ 50 శాతం మహిళా రిజర్వేషన్ కొనసాగించటం హర్షించదగిన విషయమన్నారు. మహిళలు కూడా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ కుటుంబ వ్యవస్థను ఉన్నత స్థానంలో కట్టుకోవాలని అభిప్రాయపడ్డారు. అలాగే గ్రామ వార్డు సచివాలయాలలో వాలంటరీగాను, సచివాలయ సిబ్బందిలో 50 శాతం మహిళలే కనపడటం రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు తలమానికమని తెలిపారు. ఎందరో మహిళ మహనీయులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాశీస్సులను అందజేస్తున్నామన్నారు. అనంతరం మహిళ వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది, ఆర్పీలు, అంగన్వాడీలు వేరువేరుగా మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతిని ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 15వ సచివాలయ సిబ్బంది అందరూ పాల్గొన్నారు.

పోలవరం పూర్తయ్యే నాటికి బాపట్లలో సైడ్ కాలవలు పూర్తి చేస్తారా?: శ్రీధర్

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : పోలవరం పూర్తయ్యే నాటికి బాపట్ల పట్టణంలో సైడు కాలువలు పూర్తి చేస్తారా అని సీపీఐ జిల్లా సీనియర్ నాయకుడు జేబీ శ్రీధర్ సూటిగా ప్రశ్నించారు. బాపట్ల పట్టణంలో బుధవారం పలు ప్రాంతాను నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ బాపట్ల పట్టణం నడిబొడ్డున ఉన్న పాత బస్టాండ్ సెంటర్ వద్ద ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 8 వరకు రద్దీగా పాద చారులు, ఆటోలు, ప్రైవేటు వాహనాలు, ద్విచక్ర వాహ నదారులు, బస్సులతో నిత్యం రద్దీగా ఉండే ప్రదేశంలో అభివృద్ధి పేరుతో సైడ్ కాలువలు నిర్మిస్తున్నారన్నారు. బాపట్ల ప్రధాన రహదారి జిబిసి రోడ్ ఎవరి ప్రయోజనాల కొరకు పాము లాగా కాలువలు మెలికలు తిప్పారని ప్రశ్నించారు. అదేవిధంగా కరెంటు స్తంభాలు కొన్ని కాలువకు బైట పక్కన మరికొన్న కాలువకు లోపల వేయటం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని సందేహం వ్యక్తం చేశారు. తూములు వేయటానికి రోడ్డును పగల గొట్టి కంకర బస్ స్టాండ్‌లోనే పోయటంతో పాదచారులకు, బస్సుల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. దీంతో డ్రైవర్లు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. కాలువల్లో మురుగునీరు చేరి పాదచారులకు, ప్రయాణికులకు దుర్గంధం స్వాగతిస్తుందని రోగాలకు నిలయంగా మారకముందే కాలువలని నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని శ్రీధర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మామిడి బత్తుల అశోక్, రామాంజనేయులు పాల్గొన్నారు.

మహిళలపై జగన్‌రెడ్డిది మొసలి కన్నీరే

విశాలాంధ్ర-అద్దంకి : ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన ఆస్తిహక్కు చట్టానికి తూట్లు పొడిచిన జగన్‌రెడ్డికి మహిళల గురించి మాట్లాడే హక్కులేదని.. మహిళల పట్ల జగన్‌రెడ్డిది మొసలి కన్నీరేనని తెలుగు మహిళా నేతలు ధ్వజమెత్తారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని తెదేపా జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడుతో స్థానిక తెదేపా కార్యాలయంలో సీబీఎన్ జూమ్ మీటింగ్‌లో తెలుగు మహిళలు పాల్గొన్నారు. ఈసందర్భంగా పలువురు మహిళా నేతలు మాట్లాడుతూ మహిళా భద్రత పట్టని జగన్‌కు మహిళల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. సీఎం నివసించే తాడేపల్లిలో వరుస అత్యాచారాలు జరుగుతున్నా గంజాయి యథేచ్ఛగా లభిస్తున్నా తనకేం పట్టనట్లు వ్యవహరించడం మహిళా రక్షణపై జగన్‌రెడ్డి చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చన్నారు. మహిళలపై నేరాలు దేశంలో 3వ వంతు మన ఏపీలోనే జరగడం ప్రభుత్వ శాంతిభద్రతల వైఫల్యం కాదా అని ప్రశ్నించారు. చెల్లెలు సునీతకే రక్షణ కల్పించలేని జగన్ రాష్ట్రంలోని మహిళలకు ఏం రక్షణ కల్పిస్తాడు? అని విమర్శించారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు అన్నంగి మనోహరమ్మ, బాపట్ల పార్లమెంట్ తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు నాగబోతు సుజాత, అద్దంకి పట్టణ మహిళా అధ్యక్షురాలు పిన్నింటి శ్రీదేవి, మహిళా కౌన్సిలర్‌లు, మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా కూలీలతో మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - సంతమాగులూరు : మహిళా దినోత్సవం సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ ఏల్చూరు మిరప పంట పొలాలలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరకొండ మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు అవుతున్నప్పటికీ మహిళలకు రక్షణ ఇవ్వడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. పత్రికల్లో ప్రకటనలు మాత్రం వారికి న్యాయం జరుగుతుందంటున్నారని ఆచరణలో మాత్రం వారికి రక్షణ కల్పించడం వారి హక్కులను సంరక్షించడంలో కూడా న్యాయం జరగడం లేదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మహిళలను గౌరవించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, మహిళా కూలీలు ఉన్నారు.

మాదకద్రవ్యాల కేసులో లక్ష్మీనారాయణపై పీడీ యాక్టు

- ఎస్పీ వకుల్ జిందాల్

విశాలాంధ్ర - బాపట్ల : ప్రజలకు, యువతకు తీవ్ర హాని కలిగిస్తూ ప్రజా జీవితానికి ప్రమాదకరమైన మాదక ద్రవ్యాల సంబంధించిన కేసులలో నిందితుడిగా ఉన్న జడా లక్ష్మీనారాయణపై పీడీ యాక్టు ప్రయోగించి రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. మార్టూరు మండలం నాగరాజుపల్లి గ్రామానికి చెందిన జడ లక్ష్మీ నారాయణపై మార్టూరు పోలీస్ స్టేషన్‌లో గంజాయి విక్రయిస్తున్న కేసుతో పాటు వివిధ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో కేసులు నమోదైయ్యాయన్నారు. ప్రభుత్వం, పోలీస్ శాఖ ఆదేశాలను పాటించకుండా సమాజంలోని అమాయక ప్రజలను, విద్యార్థులను, యువతను లక్ష్యంగా చేసుకుని తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం పదే పదే మాదకద్రవ్యాలను విక్రయిస్తూ చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడుతుండడంతో కలెక్టర్ ఉత్తర్వుల మేరకు పీడీ చట్టంతో జైలుకు పంపించామన్నారు. ఎస్పీ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా భవిష్యత్తును కాపాడేందుకు సంకల్పం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా మన్నారు. ప్రస్తుతం సమాజంలో యువత భవిష్యత్తుని ప్రశ్నార్థకంగా మారుస్తున్న ప్రధానమైన అంశం డ్రగ్స్ అన్నారు. ఒకసారి డ్రగ్స్‌కు బానిసైతే విడిచి పెట్టలేరన్నారు. గంజాయి మత్తులో కొందరు దొంగతనాలు, చైన్ స్నాచింగ్ వంటి నేరాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్‌పై సమర శంఖాన్ని పూరించి సంకల్పం అనే కార్యక్రమాన్ని ఫైట్ ఎగైనెస్ట్ డ్రగ్స్ అను నినాదంతో ప్రారంభించడం జరిగిందన్నారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని కళాశాలలు, పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తూ, డ్రగ్స్ కు సంబంధించిన పోస్టర్ ఏర్పాటు చేయడం, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదేవిధంగా కరపత్రాలు పంచడం, అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం, కాలేజీ కమిటీలు ఏర్పాటు చేయడం, విద్యార్థులకు డ్రగ్స్‌కు సంబంధించిన ప్రశ్నలతో క్విజ్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. డ్రగ్స్ వాడని, డ్రగ్స్ లేని, డ్రగ్స్ రహిత కాలేజీలకు DRUGS AWARE INSTITUTION సర్టిఫికెట్‌ను అందిస్తున్నా మన్నారు. సమాజంలోని కొంతమంది స్వార్థ ప్రయోజ నాల కోసం మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడుతూ యువతను లక్ష్యంగా చేసుకొని మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్నారన్నారు. మాదక ద్రవ్యాలను విక్రయించిన, రవాణా చేసిన, కలిగి ఉన్న 10 నుండి 20 ఏళు కఠిన కారాగార శిక్ష విధించబడుతుందన్నారు. జిల్లాలో గంజాయిని అరికట్టడమే లక్ష్యంగా 2023లో ఇప్పటి వరకు 13 కేసులు నమోదు చేసి 123.555 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని 35 మందిని అరెస్టు చేశామన్నారు. వీరిలో 4గురు గంజాయి రవాణా, 10మంది గంజాయి విక్రయదారులను అరెస్ట్ చేశామన్నారు. జిల్లాలో ఎక్కడైనా, ఎవరైనా మాదకద్రవ్యాలను కలిగి ఉన్న విక్రయిస్తున్న లేదా సేవిస్తున్నారన్న సమాచారం తెలిసిన యెడల వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ లేదా ఎస్పీ బాపట్ల హెల్ప్ లైన్ నెంబర్ 8333813228కు, యస్.ఇ.బి టోల్ ఫ్రీ నెంబర్ 14500 కు కాల్ చేసి సమాచారం అందించాలని వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

దశ యాప్‌తో అరచేతిలో న్యాయం

విశాలాంధ్ర - రేపల్లె : ఒక్క సందేశంతో న్యాయం ప్రజల ఇంటిముందు ఉండేందుకు దిశ యాప్‌ను ప్రారంభిస్తున్నట్లు జై భీమ్ భారత్ పార్టీ నాయకులు పెనుమాల సుబ్బారావు తెలిపారు. పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దశ యాప్‌ను ఈ నెల 11న న్యాయం కోసం నేను సైతం అను నినాదంతో విజయవాడలో జరిగే బహిరంగ సభలో ఆవిష్కరిస్తున్నట్లు చెప్పారు. జై భీమ్ యాక్సిస్ జస్టిస్, జై భీమ్ భారత్ పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కోల్పోయే ప్రతి ఒక్కరూ న్యాయం పొందటానికి అర్హులేనని అలాంటి వారి కోసం ఇంటి ముంగిటే న్యాయం పొందే అవకాశాన్ని ఈ యాప్ ద్వారా కల్పిస్తున్నారని తెలిపారు. ఈ యాప్‌ను మొబైల్‌లో డౌన్ లోడ్ చేసుకోవాలని కోరారు. రేపల్లె నియోజకవర్గ కన్వీనర్, న్యాయవాది దోవా రమేష్ రాంజీ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలతో పాటు అన్ని వర్గాల వారి అభ్యున్నతికి కోసం శ్రావణ్ కుమార్ పాటు పడుతున్నారని 20 సంవత్సరాలు సర్వీస్ ఉన్నన్నప్పటికీ న్యాయమూర్తి ఉద్యోగాన్ని సైతం వదులుకొని ప్రజలకు సేవ చేయాలని వచ్చారని తెలిపారు. బహిరంగ సభను జయప్రదం చేయాలని రాంజీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రేపల్లె మండల కన్వీనర్ కర్రా బాబురావు చెరుకూరి లక్ష్మణరావు తదితరులున్నారు.

పశువుల వ్యాధులపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర - రేపల్లె : పశు వైద్య సేవలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపిపి రావు నెహ్రూ లక్ష్మీ కుమారి అన్నారు. మండలంలోని పేటేరులో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులకు వ్యాధులు సోకకుండా టీకాలు వేసుకోవాలని సూచించారు. ఉచిత పశు వైద్య శిబిరంలో 87 పశువులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 28 దూడలకు నట్టల నివారణ మందులు ఇచ్చారని తెలిపారు. అనంతరం ఇంటస్ కంపెనీ తరుపున రైతు సోదరులకు ఉచితంగా దాణా కాల్షియం, మినరల్ మిక్చర్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పేటేరు గ్రామ సర్పంచ్ కనపర్తి. వసుమతి వైసిపి పేటేరు ఇంచార్జి కనపర్తి రవి కిరణ్ పశువైద్యులు డాక్టర్. మీనాక్షి దేవి డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ బి. లక్ష్మీ రంజిత, డాక్టర్ బి. జగదీష్ కుమార్, డాక్టర్ కరీముల్లా పశువైద్య సేవలు అందించారు.

సమాజంలో మహిళల పాత్ర అత్యున్నతం

విశాలాంధ్ర - నిజాంపట్నం : సమాజంలో మహిళల పాత్ర ఎంతో అత్యున్నతమైందని మండల సమాఖ్య అధ్యక్షురాలు పి.శ్రీలక్ష్మి, ఏపీఎం ఎస్.జె కృపా సాగర్ అన్నారు. బుధవారం నిజాంపట్నంలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించి తమ ప్రతిభను చాటుకోవాలన్నారు. మారుతున్న కాలానికి అనుకూలంగా మహిళలు చైతన్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. అర్థాంగమైన మహిళలు సమానత్వం కోసం పురుషులతో పోటీపడాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న స్వయం ఉపాధి పథకాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా ఎదగాలని వారు సూచించారు. అనంతరం మహిళలు ర్యాలీ నిర్వహించారు. మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీసీలు జి.సేశావతరం, కే మంజుల, వి.దేవిప్రసన్న, జె.కోటేశ్వరి, అకౌంటెంట్ నాగలక్ష్మి, వీవోఏలు, గ్రామ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యతోనే మహిళాభివృద్ధి

సీనియర్ సివిల్ జడ్జి బాబులు నాయక్

విశాలాంధ్ర - బల్లికురవ : నేడు సమాజంలో మహిళలు అన్ని రంగాలలో రాణించాలంటే విద్య తప్పనిసరి అని ప్రతి ఒక్కరూ విద్యారంగంలో రాణించాలని, సమాజాభివృద్ధిలో మహిళలే భావితరాలకు ఆదర్శప్రాయం కావాలని సీనియర్ సివిల్ జడ్జి బాబులు నాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొప్పెరపాడు జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో మహిళా దినోత్సవ పురస్కరించుకుని న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయక్ మాట్లాడుతూ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అప్పుడే కుటుంబాలు రోడ్డున పడకుండా ఉంటాయన్నారు.కుటుంబంలో భార్యాభర్తలు ఇద్దరు సమానమేనని సర్దుకుని పోతేనే ఆ కుటుంబంలో సుఖ సంతోషాలతో వారి బిడ్డల భవిష్యత్తు కూడా బాగుంటుందనరు. మహిళలు తల్లిగా,చెల్లిగా,భార్యగా,కూతురుగా,ఇలా ఎన్నో గురుతరమైన బాధ్యతలను నెరవేరుస్తూ కుటుంబ అభివృద్ధిలోనూ,సమాజ ఆర్థిక అభివృద్ధి లోనూ తమ వంతు భూమికను ప్రశంసనీయంగా పోషిస్తున్నారని అన్నారు.జూనియర్ సివిల్ జడ్జి ప్రియదర్శిని మాట్లాడుతూ ఎన్నో రంగాలలో మహిళలు విశేషంగా రాణించి దేశ చరిత్రలో ఎంతోమంది మహిళలు నిలిచిపోయారని,వారిని ఆదర్శంగా తీసుకొని సమాజంలో లింగ వివక్షత ఉండకూడదని తల్లిదండ్రులే పిల్లలను సమానంగా పెంచా లన్నారు. నేడు సమాజంలో మహిళలపై నిత్యం అనేక అగైత్యాలు జరుగుతున్నాయని వీటిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరు ముందుండాలన్నారు.మహిళల స్వేచ్ఛను హరించే ఏ విధమైన చర్యలను ఊపేక్షించ కుండా వాటిని నిరోధించేందుకు ప్రభుత్వం కఠినమైన చట్టాలను అమలు చేయాలన్నారు. ఏపిపి కుసుమలత లాయర్లు షేక్ జబార్, గృహలక్ష్మి, కోటేశ్వరరావు, గ్రామ సర్పంచి బండారు వెంకా యమ్మ గురవయ్య, ఏఎస్ఐ బాలకృష్ణ పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్ పాల్గొన్నారు.

రాక్షస పాలన అంతమొందించేందుకు మహిళలు నడుం బిగించాలి

- అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే ఏలూరి

విశాలాంధ్ర - మార్టూరు : టిడిపి ప్రభుత్వంలో మహిళా సాధికారికతకు అగ్రస్థానం కల్పించామని మహిళలకు అన్ని రంగాల్లో అవకాశం కల్పించడం జరిగిందని మాజీ ముఖ్యమంత్రి టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఇసుక దర్శిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కనెక్ట్ సిబిఎన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. బాపట్ల పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలో పర్చూరు నియోజకవర్గానికి చెందిన మహిళాప్రతినిధులతో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తమకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించి అండగా ఉంటున్నారని మహిళలు చంద్రబాబుకు తెలిపారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వంలో మహిళలకు తీవ్రంగా అన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలనను అంతమొందించేందుకు మహిళలంతా నడుం బిగించాలన్నారు. అనంతరం క్యాంప్ కార్యాలయంలో భారీ కేక్ ను కట్ చేసి మహిళలకు తినిపించారు.

ఘనంగా చెన్నకేశ్వర స్వామి దేవస్థానం వార్షికోత్సవం

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలో చెన్నకేశవ స్వామి దేవస్థానం అనంత వార్షికోత్సవం సందర్భంగా అర్చకులు నారాయణ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో వేకువ జాము నుండి ప్రభాత తోమాల విశ్వక్సేన ఆరాధన, మూలవరుల విశేషా అర్చనలు ఘనంగా నిర్వహించారు.అర్చకులు మహిళా భక్తులచే సంకల్ప సహిత ఏకాదశ పర్యాయ విష్ణు సహస్రనామ పారాయణము ఏక పర్యాయ హనుమాన్ చాలీసా పారాయణలు నిర్వహించారు. గ్రామంలోని మహిళా భక్తులు పారాయణ సంకల్పన అంతరం తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామాల్లోని మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీకాంత్ విజయానికి కృషి చేయాలి

విశాలాంధ్ర - యద్దనపూడి : తెలుగుదేశం పార్టీ శాసనమండలి పట్టభద్రుల అభ్యర్థిగా పోటీ చేస్తున్న కంచర్ల శ్రీకాంత్ విజయానికి తోడ్పడాలని ఆ పార్టీ నాయకులు గ్రామాలలో ఓటర్లను కలిసి అభ్యర్థించారు. మండలంలోని యద్దనపూడి, గన్నవరం, పూనూరు, అనంతవరం, తదితర గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

పట్టభద్రుల ఓటర్లకు ఎన్నికల నమూనా పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కనపర్తి నాగేశ్వరరావు నల్లపనేని రంగయ్య చౌదరి , రాయపాటి సీతయ్య,గుదే తారక రామారావు, కొరటాల వంశీకృష్ణ, ఈరపనేని వాసు పాల్గొన్నారు.

మీగడ వెంకటేశ్వర రెడ్డిని గెలిపించండి

మండల కార్యదర్శి గుడిపాటి మల్లారెడ్డి

విశాలాంధ్ర - జె.పంగులూరు : నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే పీడీఎఫ్ అభ్యర్థికి మీ ఓటు వేసి గెలిపించాలని సిఐటియు మండల కార్యదర్శి గుడిపాటి మల్లారెడ్డి కోరారు. మండలంలోని చిన మల్లవరం గ్రామంలో బుదవారం తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం మల్లారెడ్డి, రైతు సంఘం నాయకులు తలపనేని రామారావు చేశారు.

చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా: ఆఫ్కో చైర్మన్

విశాలాంధ్ర - భట్టిప్రోలు : రాష్ట్ర వ్యప్తంగా ఉన్న చేనేత సహకార సంఘాలను సందర్శించి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు ఆఫ్కో చైర్మన్ గంజి చిరంజీవి అన్నారు. మండలంలోని ఐలవరం, రాజవోలు, గ్రామాలలోని చేనేత సహకార సంఘాలను బుధవారం ఆయన సందర్శించి అక్కడ తయారు చేస్తున్న వస్త్రాలను పరిశీలించిన అనతరం సహకార సంఘాల రికార్డులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఐలవరం చేనేత పారిశ్రామిక సహకార చేనేత సహకార సంఘంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆఫ్కో సంస్థ చేనేత సహకార సంఘాలకు చెల్లించాల్సిన బకాయిలను త్వరితగతిన చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రేపల్లె, ఇసుకపల్లి, భట్టిప్రోలు, ఐలవరం గ్రామాలోని చేనేత సహకార సంఘాలు ఆఫ్కోకి ఉత్పత్తి వస్త్ర ఉత్పత్తులను అందించే విషయంలో ముందున్నాయని ఆయన తెలిపారు. చేనేత వర్గాలకు అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నేతన్న నేస్తం పథకం ద్వారా సంవత్సరానికి రూ. 24 వేలు కార్మికుల ఖాతాల్లో జమ చేస్తున్నారన్నారు. ఐలవరం చేనేత సహకార సంఘంలో డ్రెస్ మెటీరియల్స్, షర్టులు, పంచెలు, చున్నీలు అధికంగా ఉత్పత్తి చేయడం జరుగుతుందని సంఘం అధ్యక్షులు తెలిపారు. వర్క్ షెడ్లు నిర్మించుకునేందుకు అనుమతులు మంజూరు చేయించాలని కోరాగా స్పందించిన చిరంజీవి సంబంధితాధికారులతో ఫోన్ మాట్లాడి తక్షణమే వర్క్ షెడ్లు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయించారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని డైయింగ్‌లో పని చేస్తున్న మహిళలను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, జొన్నాదుల శరత్‌బాబు, మాచర్ల హేమసుందరరావు, జొన్నాదుల నిషాంత్‌కుమార్, గట్టు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మంచిని మరచి చెడును ప్రచారం చేయడం దురదృష్టకరం: ఎమ్మెల్యే కోన

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ ఫలాల వివరాలను మరచి, చెడును ప్రచారం చేయడం దురదృష్టకరమని మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి అభిప్రాయపడ్డారు. బుధవారం 24వ వార్డు, 15వ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాలను బాపట్ల మున్సిపల్ లీగల్ అడ్వైజర్ కంచర్ల రవిబాబు నివాస వద్ద నుండి ప్రారంభించి వార్డు కోఆర్డినేటర్ ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు ఇంటి వద్ద ముగించారు. ఈ సందర్భంగా వార్డులోని పలు ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడానికి అధికారులకు ఆదేశాలు ఇవ్వడం శుభ సూచికమని వార్డు ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అలాగే ఐదేళ్లకు ఒకసారి మా గడపలు దగ్గరకు వచ్చే నాయకుల విధానాన్ని మార్చి ప్రతి ఏడాది మా మధ్యకు రావడం గడపగడపను దర్శించడం ముఖ్యమంత్రి వైస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలన దర్శనకు నిదర్శనంగా నిలిచిందని పలువురు మహిళలు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కోన రఘుపతి మాట్లాడుతూ రాష్ట్రంలో మంచిని గురించిన అనేక సంక్షేమ కార్యక్రమాలు జరుగుతూ ఉంటే వాటిని విడిచి చెడును మాత్రమే ప్రచారం చేయడం సిగ్గుచేటు అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వందకు వందశాతం నెరవేర్చగలిగినటువంటి దార్శనికుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని అభివర్ణించారు. నేడు బాపట్ల జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు అన్నిటికీ కూడా ముఖ్యమంత్రి చేసిన సహాయం భవిష్యత్ తరాలు కూడా మర్చిపోలేరని కోన రఘుపతి జగన్మోహన్ రెడ్డిపై ప్రశంస వర్షం కురిపించారు. ఈ రోజు గడపగడపకు మాకు సన్మానాలు దక్కుతున్నాయి అంటే ఇది ముఖ్యమంత్రి చేస్తున్నటువంటి అభివృద్ధికి నిదర్శనమని ఈ విషయాన్ని ప్రజలందరూ కూడా ప్రచారం చేయాలని మాజీ డిప్యూటీ స్పీకర్ కోన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 24 వ వార్డు వైఎస్ఆర్సిపి ఇన్చార్జి లు ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, ఇమ్మడిశెట్టి అంకమ్మరావు, బసవయ్య వైఎస్ఆర్సిపి నాయకులు, ఆదిలక్ష్మి, నక్క వీరారెడ్డి, వడ్డీముక్కల డేవిడ్, కాగితే సుధీర్ బాబు, చింతల రాజశేఖర్, ప్రసాద్ రెడ్డి, పెరికల్ జోసెఫ్, నారాయణరెడ్డి, ఇతరులు పాల్గొన్నారు.